నేడు కళ్యాణదుర్గానికి మంత్రి లోకేశ్

- రెండు రోజులు కార్యక్రమాల్లో పాల్గొననున్న యువనేత
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు, పార్టీ శ్రేణులు
- ఐదు వందలు పైబడిన వాహన శ్రేణితో స్వాగతానికి ఏర్పాట్లు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పక్కన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

కళ్యాణదుర్గం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కళ్యాణదుర్గం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయన శుక్రవారం సాయంత్రం కళ్యాణదుర్గం చేరుకోనున్నారు. అనంతరం నిర్వహించే కార్యక్రమంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గౌరవిస్తూ, అవార్డులు అందజేయనున్నారు. 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కనకదాస జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొంటారు. కంబదూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల కనకదాస కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో కంబదూరు రింగ్ రోడ్డు నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ప్రధాన రహదారులన్నీ ముస్తాబు చేశారు. సుమారు 50 వేల మంది వరకు ఈ కార్యక్రమానికి విచ్చేస్తుండటంతో అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. అలాగే 500పైబడిన (మిగతా 4వ పేజీలో..)

ఆటలకు అదిరే ఏర్పాట్లు



ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ వేదిక

నేటి నుంచి 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలు

ఆర్డీటీ స్టేడియానికి చేరుకున్న 27 జట్లు



వేదిక వద్ద మాట్లాడుతున్న ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాలకు ఆర్డీటీ స్టేడియంలోని వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 27 జట్లు జిల్లాకు చేరుకున్నాయి. ఇందులో 26 జిల్లాల జట్లు, రెవెన్యూశాఖ రాష్ట్ర కార్యాలయం జట్టు ఉన్నాయి. మొత్తం 31 క్రీడాంశాలలో పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. కళాకారులు స్టేడియంలో గురువారం రిహార్సల్స్ చేశారు. క్రీడల నిర్వహణను 16 కమిటీలు (మిగతా 4వ పేజీలో..)

అవినీతి రిజిస్ట్రేషన్..!

అక్రమాలకు అడ్డాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

- పైసలిస్తే చాలు ఏపనైనా జరుగుతుంది
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు
- అన్నింటా అదనపు వసూళ్లు



హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

హిందూపురం/చిలమత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైసలిస్తేనే పని సాగుతుంది. లేదంటే రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిందే. ప్రభుత్వం అవినీతి నిరోధానికి ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం పరిస్థితి మారడం లేదు. చేయి తడిపితే చాలు ఎన్ని లొసుగులున్నా, కోర్టు వివాదాలు ఉన్నా సరే పని పూర్తి చేస్తారు. జిల్లాలో భూముల విలువ రోజురోజుకి పెరగడంతో అవి చేతులు మారినప్పుడల్లా కార్యాలయాల్లో పనిచేసే అధికారులకు పండుగ అవుతోంది. అందుకే ఈ జిల్లాలో కొన్ని కార్యాలయాలకు సబ్‌రిజిస్ట్రార్‌గా రావడానికి చాలామంది రాష్ట్ర స్థాయిలోనే పోటీ పడుతుంటారు.

ప్రైవేటు వ్యక్తులదే హవా

జిల్లాలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులదే హవా కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికారులు మధ్యవర్తుల ద్వారా దందా నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎప్పుడైనా ఏసీబీ దాడులు జరగవచ్చనే అనుమానంతో వారు తీసుకునే మొత్తం కార్యాలయాల్లో కాకుండా అక్కడే ఉన్న ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేస్తున్నారు. సాయంత్రం కార్యాలయ సమయం ముగిశాక సంబంధిత అధికారులకు చేరుతుందనే విమర్శలు ఉన్నాయి. దస్తావేజు లేఖరులు కూడా మధ్యవర్తులుగా వ్యవహరిస్తారు. వీరికి భూమికి సంబంధించిన తప్పు ఒప్పులు తెలిసి ఉంటాయి కాబట్టి వారే చక్కబెడతారు. ఎన్ని ఆంక్షలు ఉన్నా హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులు చెప్పిందే జరుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు సమాచారం. ఈసీల కోసం కార్యాలయాల్లో భారీగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో పొందు పర్చిన ఈసీ కంటే మ్యానువల్ ఈసీలకు నాలుగింతలు అధికంగా వసూలు చేస్తున్నారు. ఈసీకి రూ. 1000 నుంచి రూ. 1200 వరకు వసూళ్లు చేస్తారు. ఈ తతంగం హిందూపురం, చిలమత్తూరు, ధర్మవరం, కదిరిలో అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రిజిస్ట్రేషన్లు చేసే సమయంలో ఆ భూములకు సంబంధించిన వివరాలు ఈసీ చూడాలి. కానీ కొన్ని సందర్భాల్లో ఇవేమి చూడకుండానే ఒకరి భూమి మరొకరికి రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి పనికి ఓ రేటు

కర్ణాటక సరిహద్దుగా ఉన్న చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికి ఓ రేటు ఉంటుంది. చిలమత్తూరు మండలం పారిశ్రామిక హబ్ కావడంతో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. బెంగళూరుకి అతి దగ్గరగా ఉండటం, కనెక్టివిటీ బాగుండటంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు మండలంలో పెద్ద ఎత్తున భూమిని కొంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న సబ్‌రిజిస్ట్రార్లు ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించినట్లు సమాచారం. చిన్న పని మొదలుకొని పెద్ద పనుల వరకు ఓ ధరను నిర్ణయించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పురంలో ఆ అధికారిదే హవా

అనారోగ్యం పేరుతో ఓ అధికారి ఏళ్ల తరబడి హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే పని చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా ఆయన మాత్రం ఇక్కడే ఉంటారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకుల అండతో ఆయన పనులు సాఫీగా సాగిపోతున్నాయి. ఇతడిపై ఏసీబీ అధికారులు పలుమార్లు నిఘా పెట్టినా చాకచక్యంగా తప్పించుకున్నట్లు సమాచారం. ఎవరైనా చేస్తున్న తప్పుని ప్రశ్నిస్తే ఆరోగ్యం బాగాలేదని చెప్పడం ఈయనకు అలవాటైంది. ఆయన హిందూపురం వచ్చాక సంపాదించిన సొమ్ము గురించి ఈ కార్యాలయంలోనే కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఇతడికి సమర్పిస్తే ఎంతటి పనైనా నిబంధనలను తుంగలో తొక్కి చక్కబెడతారన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్ది నెలల కిందట కర్నూలుకి చెందిన ఓ వ్యక్తి ఆస్తిని అడ్డదిడ్డంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. ఈయన కొంత మంది ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- హిందూపురం పట్టణంలో ఓ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఓ వ్యక్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. ఓ పేపర్లో సంతకం లేదంటూ నాలుగు రోజుల పాటు తిప్పుకున్నారు. స్థల యజమానికి అనుమానం వచ్చి మధ్యవర్తిని కలిశాడు. ఓ లకారం సమర్పిస్తే నీపని ఒక్క రోజులో చేసి పెడతానన్నాడు. అడిగినంతా ఇవ్వడంతో మరుసటి రోజే పని పూర్తయింది.
- హిందూపురం పట్టణ పరిధిలోని పెనుకొండకు వెళ్లే రహదారిలో ఓ స్థలానికి సంబంధించి భూ యజమానితో సంబంధం లేనివారు ప్లాట్లు వేసి విక్రయించారు. అయితే స్థల యజమానితో ఈసీ కూడా చేయకుండా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో భారీ ఎత్తున నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పట్లో పెద్ద దుమారం రేగింది.

పలు దఫాలుగా దాడులు

అక్రమాలకు చిరునామాగా మారిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై పలు దఫాలుగా అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు జరిగాయి. ఇక్కడ ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉండటంతో సమస్యాత్మక ఆస్తుల క్రయ విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ పనిచేసే అధికారులు ఎవరైనా సరే సంపాదనకే ప్రాధాన్యం ఇస్తారు. అన్ని రికార్డులు సరిగా ఉన్నా ఏదో ఒక కొర్రీ వేసి రిజిస్ట్రేషన్ల ఆపుతారు. ఈనేపథ్యంలోనే బాధితులు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో దాడులు జరిగాయి. అయినా ఇక్కడ పరిస్థితి మాత్రం మారడం లేదు.

తప్పులులేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- కలెక్టర్ శ్యాంప్రసాద్



సమావేశంలో కలెక్టర్, జేసీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక పునఃపరిశీలన ప్రక్రియకు సంసిద్ధతలో భాగంగా గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్.. జిల్లాల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక పునఃపరిశీలనకు సిద్ధంగా ఉండాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి కొత్త ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే మీ పని చేస్తా..!

- ధర్మవరం మున్సిపాలిటీ పరిపాలనా విభాగంలో ఓ ఉద్యోగి ఇష్టారాజ్యం
- జీతమైనా, ఇంక్రిమెంట్ కావాలన్నా చేయి తడపాల్సిందే
- వేధింపులకు అల్లాడిపోతున్న సచివాలయ ఉద్యోగులు



మున్సిపాలిటీలోని పరిపాలన విభాగం



ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం పరిపాలన విభాగంలోని ఓ ఉద్యోగి లంచావతారం ఎత్తాడు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వార్డు సచివాలయ ఉద్యోగులను పీడించుకు'తింటున్నా'డు. చేయి తడపనిదే ఏ చిన్న పని కూడా చేయడని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే చాలు చిర్రుబుర్రులాడుతూ 'నేనింతే. డబ్బులిస్తేనే పని చేస్తా. లేకుంటే లేదు. మీకిష్టమొచ్చిన వారికి చెప్పుకోండి' అంటూ బెదిరిస్తున్నారు. దీంతో కొందరు ఆయన అడిగినంత ఇచ్చుకుని పని జరుపుకుంటున్నారు. ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో 40 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 280 మంది ఉద్యోగులు ఉన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని పరిపాలన విభాగంలోని ఓ అధికారి వసూళ్లదందాతో ఈ సచివాలయాల సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు.

చెయ్యి తడపనిదే పని చేయడు

ఆ ఉద్యోగి పరిధిలో ఏ పనిచేయాలన్న కొంత సొమ్ము ముట్టచెప్పాల్సిందే. పనిని బట్టి సచివాలయ ఉద్యోగుల నుంచి డబ్బు గుంజుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈఏడాది జూలైలో బదిలీపై వచ్చిన ఆయన పలు సచివాలయ ఉద్యోగులకు మూడు నెలలపాటు జీతాలు పెట్టకుండా ఇబ్బంది పెట్టాడు. చివరికి ఆ సచివాలయ ఉద్యోగులు ఒక్కోక్కరు రూ.వెయ్యి నుంచి రూ.మూడువేల వరకు ముట్టచెప్పిన తర్వాత జీతాల బిల్లులు గత నెల చేసినట్టు సమాచారం. ఇంక్రిమెంట్ల విషయంలో కూడా నాలుగు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోలేదని పలువురు సచివాలయ ఉద్యోగులు వాపోయారు. సొమ్ము ముట్టచెప్పిన వారికి ఇంక్రిమెంట్‌లు మంజూరు చేసినట్లు తెలిసింది. అరియర్స్ మంజూరుకు కూడా 10 శాతం కమీషన్ తీసుకుంటున్నట్టు సమాచారం. ప్రతి చిన్నపనికి ఆ ఉద్యోగి అడిగినంత లంచం ఇవ్వాలంటే తమవల్ల కావడంలేదని పలువురు సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే తమకు తక్కువ జీతాలు అని, అందులోనూ ఇలా లంచాలు ఇచ్చుకోవాలంటే ఎలా అన్ని ప్రశ్నిస్తున్నారు. ఆ అధికారి తీరు పట్ల మున్సిపాలిటీ అధికారులకు తెలియజేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

సచివాలయ ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ, డబ్బులు వసూళ్లు చేస్తున్న అధికారి విషయం మా దృష్టికి రాలేదు. సచివాలయ ఉద్యోగులు కూడా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. అయినా విచారించి చర్యలు తీసుకుంటాం.

\- సాయికృష్ణ, ఇన్‌చార్జ్ కమిషనర్

రేపు అఖండ భజన

పుట్టపర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని సాయికుల్వంత్ సభా మండపంలో శనివారం అఖండ భజన చేపడుతున్నారు. ఏటా జరిగే అఖండ భజనకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. భజన సాయంత్రం 6 గంటలకు మొదలై.. 24 గంటల పాటు కొనసాగుతుంది. ఆదివారం సాయంత్రం మంగళహారతితో భజన ముగుస్తుంది.

సమగ్ర విద్యను బలోపేతం చేయాలి: కలెక్టర్



దివ్యాంగ విద్యార్థికి మోటారు ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

కొత్తచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సమగ్ర విద్య అమలును బలోపేతం చేయాలని ఎంఈఓలు, ఉపాధ్యాయులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు, లైన్ విభాగాల అధికారులకు ఐఈ కార్యకలాపాలపై ఒక రోజు అవగాహన కార్యక్రమం పుట్టపర్తి మండలం జగరాసిపల్లిలోని మంగళకర ఇంగ్లిషు మీడియం ఉన్నతపాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై సమగ్ర విద్య బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాజకీయాలకు దూరంగా ఉండాలని, పాఠశాలకు సరైన సమయానికి హాజరు కావాలన్నారు. లీవ్ రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. డ్యూటీ సమయంలో ఉపాధ్యాయులు ఇతర కార్యక్రమాలలో పాల్గొనరాదని సూచించారు. ఉపాధ్యాయులు ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో ఉండేలా చూడాలని, చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసి మెరుగు దిద్దాలన్నారు. 2026లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం రూ.1.5లక్షలు విలువైన ఎలక్ట్రికల్ మోటారు ట్రైసైకిళ్లను ముగ్గురు దివ్యాంగులకు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, సమగ్రశిక్ష అధికారి దేవరాజ్, ఎంఈఓలు, లైన్ విభాగాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ADCA అడ్డదారి క్రికెట్ అసోసియేషన్..!

- సెలెక్షన్స్‌లో ఇష్టారాజ్యం
- అకాడమీలు, ప్రైవేటు కోచ్‌ల హవా
- తమ వారి కోసం స్కోర్లను మార్చేస్తున్న వైనం
- ప్రతిభావంతులకు అన్యాయం



సెలెక్షన్స్ వద్ద బయటి వ్యక్తులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం (ఏడీసీఏ) కాస్తా.. అడ్డదారి క్రికెట్ సంఘంగా మారిపోయింది. అందులో అన్నీ అక్రమాలే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రికెటర్ల సెలెక్షన్స్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నారు. సెలెక్షన్స్‌లో అకాడమీలు, కోచ్‌ల హవా నడుస్తున్నట్లు తెలుస్తోంది. సిఫార్సులకు అనుగుణంగా ఏకంగా సెలెక్షన్ మ్యాచ్‌ల స్కోర్లనే మార్చేస్తున్నారన్న ఆరోపణలు బాధిత క్రికెటర్ల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. క్రికెట్‌తో సంబంధంలేని వ్యక్తులకు అసోసియేషన్‌లో అవకాశం కల్పిస్తుండడం శోచనీయం. అవినీతి ఆరోపణలతో వారిని తొలగిస్తున్నా.. మళ్లీ అసోసియేషన్‌లో చోటు కల్పిస్తుండడం గమనార్హం.

పోటీని ఆసరాగా చేసుకుని..

క్రికెట్‌లో తీవ్ర పోటీ ఉంటుంది. దానిని దళసరాగా చేసుకుని కొందరు క్రికెట్‌ను వ్యాపారంగా మార్చేస్తున్నారు. సెలెక్షన్లలో క్రికెటర్ల ప్రతిభ ఆధారంగా జట్టులోకి ఎంపిక చేస్తారు. ప్రాబబుల్స్‌లో జరిపే మ్యాచ్‌లలో స్కోరు బోర్డులనే మార్చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉండే పిల్లల స్కోర్లను పెంచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన అండర్-14 జిల్లా బాలుర క్రికెట్ (మిగతా 4వ పేజీలో..)

అర్హులందరికీ ఉజ్వల: జేసీ



మాట్లాడుతున్న జేసీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులందరికీ ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధి చేకూర్చాలని జేసీ మౌర్యభరద్వాజ్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం జిల్లాస్థాయి దీపం, ఉజ్వల కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. అర్హులందరికీ ఉజ్వల కనెక్షన్లు ఇవ్వాలని ఆయిల్ కంపెనీ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైవేపై ఆపితే.. సైరన్ మోగుద్ది..!

- లేజర్ సెన్సర్ నిఘా ఏర్పాటుకు చర్యలు
- అన్ విజిబుల్ లేజర్ రేస్‌తో పసిగట్టే పరికరాలు
- రెండు నిముషాలు దాటితే సైరన్
- పోలీసులు, ఉన్నతాధికారులకు సమాచారం

4

ADCA అడ్డదారి క్రికెట్ అసోసియేషన్..!

(3వ పేజీ తరువాయి)

జట్టు ఎంపిక మ్యాచ్‌లో ఓ క్రికెటర్ 57 పరుగులు చేస్తే.. 31 మాత్రమే చేసినట్లు మార్చేశారట. మరో క్రికెటర్ 39 పరుగులు చేయగా.. 71గా మార్చి జట్టులోకి ఎంపిక చేయడం గమనార్హం. ఓ బౌలర్ 6 వికెట్లు తీయగా.. 2గా మార్చేసినట్లు తెలుస్తోంది. ఓ బాలుడు వికెట్ మాత్రమే తీయగా.. 5 పడగొట్టినట్లు మార్చడంతో వివాదం తలెత్తింది. ప్రాబబుల్స్ సెలెక్షన్స్ మ్యాచ్‌లో, నెట్ సెలెక్షన్స్‌లో బయటి వ్యక్తులను లోపలికి అనుమతించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనన ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉండి, అర్హత, ప్రతిభగల క్రికెటర్లకు అన్యాయం చేస్తున్నారని పలుమార్లు బాధిత చిన్నారుల తల్లిదండ్రులు.. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), బీసీసీఐకి ఫిర్యాదులు చేశారు. అయినా క్రికెట్ సంఘంలో మార్పు రావట్లేదు.



జిల్లా క్రికెట్ సంఘం (ఏడీసీఏ)

ప్రైవేటు వ్యక్తుల జోక్యం

సెలెక్షన్స్, మ్యాచ్‌ల సమయంలో క్రికెట్ సంఘానికి సంబంధంలేని బయటి వ్యక్తులు జోక్యం మితిమీరుతోంది. దీంతో ప్రతిభగల వారికి తీరని అన్యాయం వాటిల్లుతోందనే చర్చ సాగుతోంది. సంఘంలోని సభ్యుల కంటే బయటి వ్యక్తుల హడావుడి, ప్రదర్శనలు అధికమవుతున్నాయి. సెలెక్షన్స్, మ్యాచ్‌ల సమయంలో అకాడమీల నిర్వాహకులు, కోచ్‌ల ప్రమేయం ఉండకూడదనేది బీసీసీఐ నిబంధన. అందుకు విరుద్ధంగా జిల్లాలో అకాడమీలు, ప్రైవేటు కోచ్‌ల హడావుడి కనిపిస్తోంది. సామాన్య క్రికెటర్లకు అన్యాయం వాటిల్లుతోందని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు.

సిఫారసులకు పెద్దపీట

క్రికెటర్ల ఎంపికలో సిఫారసులకే పెద్దపీట వేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఎక్కువగా నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో శిక్షణ పొందుతున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. కోచ్‌గా ఉంటున్న ఓ వ్యక్తి జిల్లా క్రికెట్ సంఘంలో తన రాజకీయ పలుకుబడితో చక్రం తిప్పుతున్నారనే చర్చ సాగుతోంది. తమ వద్ద కోచింగ్ తీసుకునే వారికి జట్టులోకి ఎంపిక చేస్తామని మభ్యపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కోచ్‌ను పలు ఆరోపణలతో పీటీసీ నుంచి తొలగించారు. తన పరపతితో తిరిగి అక్కడికే రావడం పట్ల అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ కోచ్‌కు అనుకూలమైన వారినే జట్టుకు సిఫారసు చేస్తున్నారని బాధిత క్రికెటర్ల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ప్రక్షాళన చేసేరా?

ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం పదవీ కాలం ఈ నెలతో ముగియనుంది. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. నెలాఖరులోపు ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని ఇప్పటికే బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ సంఘం నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. గతంలో జిల్లా కార్యదర్శిగా పనిచేసి పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న అభ్యర్థులే తిరిగి సెక్రటరీ, ప్రెసిడెంట్ పదవుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. క్రికెట్‌కు సంబంధం లేని వ్యక్తి గతంలో ఏడీసీఏలో పనిచేశాడు. పలు ఆరోపణలతో అతడిని తొలగించారు. అదే వ్యక్తిని ఆరు నెలల క్రితం ఏడీసీఏలోకి తీసుకోవడం శోచనీయం. ఎన్ని అవినీతి ఆరోపణలు ఉన్నా.. తమ వారైతే చాలు అన్నట్లుగా వ్యవహారం సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా అడ్డదారుల్లో క్రికెట్‌తో సంబంధంలేని వ్యక్తుల ప్రమేయం అధికమవుతుండడంతోనే సెలెక్షన్స్‌లో అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి. బీసీసీఐ, ఏసీఏ దృష్టి సారించి జిల్లా క్రికెట్ సంఘాన్ని ప్రక్షాళన చేయాలని క్రికెట్ అభిమానులు కోరుతున్నారు.

పారదర్శకంగా సెలెక్షన్స్

జిల్లా క్రికెట్ జట్టు సెలెక్షన్స్ పారదర్శకంగా నిర్వహించాం. ఇందులో ఇతరుల ప్రమేయం ఉండదు. ప్రతిభ ఆధారంగా తుది జట్టుకు ఎంపిక చేస్తారు. స్కోరు వివరాల నమోదు బహిరంగంగానే సాగుతుంది. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేస్తారు. మార్చే అవకాశం ఉండదు. జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలపై చర్చిస్తున్నాం.

- జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు

కొనసాగిన ఏసీబీ తనిఖీలు

- బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకూ..

చిలమత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండోరోజు గురువారం కూడా ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఏసీబీ అధికారులు హమీద్‌ఖాన్, జయమ్మ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు తనిఖీలు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్‌తో పాటు కార్యాలయంలో పనిచేసే ప్రైవేటువ్యక్తులు, మరికొందరు దస్తావేజు లేఖరులను వారితో పాటు కార్యాలయంలో ఉంచుకొని రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రూ.4060 పట్టుబడగా దాన్ని సీజ్ చేశారు. కార్యాలయంలో పనిచేసే ఓ ప్రైవేటు వ్యక్తి ఫోన్ పే ద్వారా పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరగడంతో దానిపై ఆరా తీశారు. ఎందుకు అంత పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిగాయి? సబ్‌రిజిస్ట్రార్‌కి ఈ నగదు వెళ్లిందా? అని ప్రశ్నించినట్లు సమాచారం. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వారికి కావాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలున్న ఫైళ్లను వెంట తీసుకెళ్లారు.

టీడీపీ సీనియర్ నాయకుడు
గాలివేటి శ్రీరాములు నాయుడు మృతి



గాలివేటి శ్రీరాములు నాయుడు, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

నల్లచెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కదిరి నియోజకవర్గ నాయకుడు గాలివేటి కృష్ణమోహన్ నాయుడు తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు గాలివేటి శ్రీరాములు నాయుడు(77) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన కదిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతితో నల్లచెరువు మండలంలో విషాదం అలుముకుంది. ఆయన అంత్యక్రియలను శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వగ్రామం చిన్నయల్లంపల్లిలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలియగానే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు సతీష్ చౌదరి, నాగరాజు, గుత్తా ప్రసాద్, దేవేంద్ర గౌడ్ తదితరులు నివాళులు అర్పించారు.

స్వయం ఉపాధి శిక్షణ

కొత్తచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):మహిళలకు స్వయం ఉపాధిపై 14 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల కేంద్రంలోని ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివిన 19 నుంచి 45 ఏళ్లలోపు మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. జూట్, కూరగాయల బ్యాగుల తయారీలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు వచ్చే మహిళలు ఆధార్, రేషన్‌కార్డులు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, పదో తరగతి విద్యార్హత పత్రం, మూడు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది ఉత్తీర్ణులైన 19 నుంచి 45 ఏళ్లలోపు పురుషులకు వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీలో నెల రోజులు శిక్షణ ఇస్తామన్నారు. పుట్టపర్తి మండలంలోని బ్రాహ్మణపల్లిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. వసతితో పాటు భోజనం అందజేస్తామన్నారు.

జిల్లా హాకీ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా హాకీ బాలురు, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జిల్లా అండర్-14 బాల, బాలికల హాకీ జట్లు ఎంపిక చేశారు. గురువారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ ఇరు జిల్లాల కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ ప్రకటించారు. బాలుర జట్టుకు వంశీ, బాలాజీ, బన్సారుద్దీన్, జస్వంత్, మోహిత్‌నాయక్, ఉపేంద్ర, తిరుమలేష్, వినయ్, గణేష్, రిత్విక్, మురారి, శశి, నగేష్, రామ్‌చరణ్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో అనిత, వీణ, మనీషా, శిల్ప, నిత్యశ్రీ, అనన్య, హర్షిణి, ఉష, గీత, పూజ, హేమలత, వర్షిత, రుషిత, సుదీప, దీప్తి, సుమిత్ర చోటు దక్కించుకున్నారు. ఎంపికైన జట్లు నెలాఖరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, సుహాసిని, శ్రీధర్, రమేష్, సురేష్, ప్రభాకర్, శాంతలింగం, నిర్మల, మల్లికార్జున, లోకేశ్వరి పాల్గొన్నారు.

నేడు కళ్యాణదుర్గానికి
మంత్రి లోకేశ్

(3వ పేజీ తరువాయి)

వాహన శ్రేణితో మంత్రి లోకేశ్‌కు వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలకనున్నారు. అనంతరం ర్యాలీగా కళ్యాణదుర్గం టీడీపీ కార్యాలయం చేరుకోనున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పార్టీ పరిశీలకులు నాగేశ్వరయాదవ్‌తో పాటు డివిజన్ స్థాయి అధికారులంతా సభావేదిక ఏర్పాట్లు, శెట్టూరు రోడ్డులో మంత్రి నారా లోకేశ్ శుక్రవారం రాత్రి బస చేసే ప్రాంతాన్ని పరిశీలించారు.

వివాదాలకు తావులేకుండా డీఎస్సీ నిర్వహణ

ఎటువంటి వివాదాలకు తావు లేకుండా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసి, అర్హులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు అందించిన ఘనత మంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందని ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కొనియాడారు. కళ్యాణదుర్గంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీట్లు లేవని బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తీసుకెళ్లడానికి మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికే పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో 1500 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడంతో అక్కడ సీట్లు లేవని బోర్డు పెట్టారన్నారు. ఇలాంటి పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా రావాలనే భావనతో మంత్రి లోకేశ్ పని చేస్తున్నట్లు తెలిపారు.



ఆర్డీటీ స్టేడియం ముఖద్వారం వద్ద భారీగా ఫ్లెక్సీలు


ఆర్డీటీ స్టేడియం లోపల ఏర్పాట్లు

ఆటలకు అదిరే ఏర్పాట్లు


రెవెన్యూ క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్

(3వ పేజీ తరువాయి)

పర్యవేక్షిస్తున్నాయి. సుమారు 3వేల మందికి వసతి, భోజనం ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు హాజరవుతారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు భాగస్వాములవుతారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతారు.

ఘనంగా నిర్వహిస్తాం: బొప్పరాజు

రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి జాయింట్ కలెక్టర్ శివ నారాయణస్వామి 27జట్ల క్రీడాకారులకు స్వాగతం పలికారు. రిహార్సల్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా జేసీ, బొప్పరాజు మాట్లాడుతూ, అతిథులతో పాటు 27 జట్ల క్రీడాకారులకు ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు క్రీడోత్సవాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. మునుపెన్నడూ జరపని రీతిలో అంగరంగ వైభవంగా, సమష్టిగా క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, అహుడా సెక్రటరీ రామకృష్ణా రెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఆర్డీఓలు కేశవనాయుడు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లి కార్జునరెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, రమేష్‌రెడ్డి, తిప్పేనాయక్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్‌బాబు, సోమశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మధునాయక్, మీడియా ఇన్‌చార్జి మునివేలు, డీఎస్‌డీఓ మంజుల, స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యోగుల ఉత్సాహం..

హైవేపై ఆపితే..
లేజర్ సెన్సర్ నిఘా ఏర్పాటుకు చర్యలు
సైరన్ మోగుద్ది..!

- అన్ విజిబుల్ లేజర్ రేస్‌తో పసిగట్టే పరికరాలు
- రెండు నిముషాలు దాటితే సైరన్
- పోలీసులు, ఉన్నతాధికారులకు సమాచారం
- జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుకు అడుగులు


రాప్తాడు వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు, సంస్థ ప్రతినిధి

రహదారి అద్భుతంగా ఉంటుంది. రాత్రిళ్లు పెద్దగా ట్రాఫిక్ ఉండదు. అతివేగంతో వాహనాలు వెళ్తుంటాయి. ఆ సమయంలో దగ్గరకు వెళ్లాక రోడ్డుపై ఆపిన వాహనం కనిపిస్తుంది. నేరుగా వెళ్లి ఢీకొడుతున్నారు. తప్పించేందుకు పక్కకు తిప్పితే బోల్తా ప్రమాదం ఉంటుంది. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రయాణికులతో వెళ్లే బస్సులు ఢీకొంటే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. నిద్రపోతున్న వారు నిద్రలోనే మరణిస్తున్నారు. బైక్‌లు, ఆటోలు, లారీలు ఢీకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం రోడ్డుపై వాహనాలు ఆపడమే. ఈ తరహా ప్రమాదాలను అరికట్టాలంటే రోడ్డుపై వాహనాలు ఆపకుండా చూడడమే మార్గమని పోలీసు శాఖ భావిస్తోంది. ఆ దిశగా జిల్లా పోలీసులు తొలిసారి అడుగులు వేస్తున్నారు. ఓ ప్రైవేటు సంస్థతో కలిసి జిల్లాలో ప్రధానమైన 44వ నంబరు జాతీయ రహదారిపై లేజర్ సెన్సర్ సిస్టం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇకపై రోడ్డుపై వాహనాలు ఆపితే వెంటనే సైరన్ మోగుతుంది. తర్వాత పోలీసులు, ఉన్నతాధికారులకు సైతం అలర్ట్ వెళ్తుంది. సంబంధిత పోలీసులు ఆపిన వాహనం వద్దకు చేరుకుని, అక్కడి నుంచి పంపించేస్తారు. ఇలాంటి సిస్టంను జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేయనున్నారు.

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై, పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగి పలువురు చనిపోతుంటారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినపుడు రోడ్ల పక్కన నిలిపి ఉంచిన వాహనాలను వెంటనే గుర్తించి, అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేస్తే.. ప్రమాదం జరిగేది కాదు అనుకుంటుంటాం. ఆ దిశగా పోలీసు శాఖ అడుగులు వేస్తోంది. కేవై సొల్యూషన్స్ సంస్థతో కలిసి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు సరికొత్త పరికరాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. రోడ్లపై ఆగి ఉన్న వాహనాలను లేజర్ సెన్సర్ ద్వారా గుర్తించే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలులోకి తీసుకురానుంది.

ప్రమాద ప్రాంతాల గుర్తింపు

జిల్లా పోలీసు శాఖ.. కేవై సొల్యూషన్స్ సంస్థతో కలసి యాంటీ పార్కింగ్ లేజర్ సెక్యూరిటీ సిస్టం పరికరాలను రహదారుల వద్ద అమర్చుతారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వాటి లేజర్ సిగ్నల్స్ ఆధారంగా వాహనాలను గుర్తిస్తారు. ఎక్కడైనా రోడ్డుపై లారీలు, కంటైనర్లు ఇతర వాహనాలు నిలిపి ఉంచినా.. కదలకుండా అలాగే ఉన్నా.. లేజర్ సెన్సర్ కిరణాలు వాటిపై పడతాయి. వాటి ఆధారంగా సమాచారం క్షేత్రస్థాయిలోనే కాకుండా పోలీసు ఉన్నతాధికారులకు కూడా చేరుతుంది. తద్వారా వాటిని అక్కడి నుంచి పంపించే అవకాశం ఉంటుంది. దీంతో ప్రయోగాత్మకంగా వీటి ఏర్పాటుకు పోలీసు శాఖ పరిశీలిస్తోంది. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, డీటీఆర్బీ సీఐ విజయభాస్కర్, రాప్తాడు సీఐ హర్ష, కేవై సొల్యూషన్స్ ప్రతినిధి శ్రీధర్.. 44వ జాతీయ రహదారిపై జిల్లా కేంద్రంలోని తపోవనం సర్కిల్, హైదరాబాద్ చాయ్ వద్ద, రాప్తాడు జంక్షన్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.

వెంటనే సమాచారం



తపోవనం సర్కిల్‌లో పరిశీలిస్తున్న సీఐలు, సంస్థ ప్రతినిధి

యాంటీ పార్కింగ్ లేజర్ సెక్యూరిటీ సిస్టం పరికరాలు ఏర్పాటుచేసిన సర్కిల్‌లోగానీ, ప్రాంతంలోగానీ వాహనాలు పార్కింగ్ చేస్తే వెంటనే లేజర్ సెన్సర్ కిరణాలు వాటిపై పడతాయి. ఫీల్డ్ అలర్ట్ వస్తుంది. 2 నిముషాల కన్నా ఎక్కువసేపు పార్కింగ్ చేస్తే వెంటనే వాయిస్ అలర్ట్ వస్తుంది. పోలీసు సైరన్ కూడా మోగుతుంది. ఆ ఏరియాకు సంబంధించిన పోలీసు అధికారులు సుమారు ఐదుగురికి ఎస్ఎంఎస్‌లు, ఫోన్ కాల్స్ రూపంలో సమాచారం వెళ్తుంది. స్థానికంగా ఫీల్డ్ అలర్ట్ రావడంతో ఆ ప్రదేశానికి చేరుకున్న (ప్రయాణం చేసే వారికి) వాహన చోదకులు అప్రమత్తం అయ్యే అవకాశం ఉంటుంది. పోలీసులకు సమాచారం వెళ్లిన వెంటనే.. అధికారులు అప్రమత్తమై పార్కింగ్ చేసిన వారిని అలర్ట్ చేస్తారు. తద్వారా వాహనాన్ని అక్కడి నుంచి పంపించేసి, ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంటుంది.

ఆశలు కంది పాయె..!

- రసం పీల్చే వైరస్‌తో ఏర్పడిన గొడ్డు చెట్లు
- పూత, కాయలు కాసే పరిస్థితి మృగ్యం
- మరికొన్ని పొలాల్లో కాయపుచ్చు తెగులు
- ప్రశ్నార్థకంగా కంది దిగుబడి
- ఆందోళనలో రైతులు

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. వేరుశనగలో ఎక్కువ నష్టాలు వస్తుండటంతో ఈఏడాది అనేకమంది రైతులు ప్రత్యామ్నాయంగా కందిని సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3.5 లక్షల ఎకరాలకుపైగా భూమిలో వర్షాధారం కింద కంది పంట సాగైంది. పైరు ఏపుగా పెరిగినా చీడపీడలతో దిగుబడిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రసం పీల్చే వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల మారుక మచ్చల పురుగు ఆశించడంతో పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో కంది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గొడ్డు చెట్లు దర్శనం

ఈ ఏడాది జూన్, జూలై మాసంలో సాగు చేసిన కంది పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. పంట శాకీయ దశలో ఉన్న సమయం సెప్టెంబరు నుంచి అక్టోబరు మధ్యలో సరైన వర్షాలు పడలేదు. వాతావరణం కూడా వేడిగా ఉండటంతో రసం పీల్చే వైరస్ సోకింది. దీంతో కంది మొక్కలు పూత పూయని గొడ్డు దశకు చేరాయి. వీటి వల్ల రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. అలాగే మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. ఈ పురుగు సోకడంతో మొక్కల్లో ఎదుగుదల లోపించింది. ఈ పురుగు లేత ఆకులు, అప్పుడే ఏర్పడిన పూత మీద గుడ్లను పెడుతుంది. గుడ్ల నుంచి పొదిగిన లార్వాలు ఆకులు, పూతను గూడుగా చేసుకొని, అందులో ఉన్న పచ్చదనాన్ని తింటాయి. తద్వారా పూత రాలిపోతుంది. కాయ ఎదుగుదల లోపిస్తుంది. ఈ పురుగు సోకిన కంది పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది.


బెళుగుప్ప మండలంలో కంది పంట


బెళుగుప్ప మండలంలో కంది గొడ్డుచెట్లు

దిగుబడి కష్టమే



ఈ సారి ఖరీఫ్‌లో 28 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. దీంతో పూత రాలిపోతోంది. మరికొన్ని చెట్లకు రసం పీల్చే వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. తద్వారా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. వేరుశనగ సాగుతో నష్టపోయి కంది పంటను సాగు చేశా. అయితే తెగుళ్లు సోకవడంతో కంది పంట దిగుబడి కూడా వస్తుందో..? రాదో తెలియని పరిస్థితి ఏర్పడింది.

-రైతు శ్రీరాములు, ఆవులెన్న, బెళుగుప్ప మండలం

పూత రాలిపోతోంది



నేను 10 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. తెగుళ్లు సోకడంతో కంది పంటలో పూత రాలిపోతోంది. దీనికితోడు వర్షాలు పడుతుండటంతోతెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయలేకపోతున్నాం. ఆకాశం ముసురుగా ఉండటంతో తెగుళ్ల ఉధృతి కూడా పెరిగింది. వేరుశనగలో నష్టాలు వస్తున్నాయని కంది సాగు చేస్తే ఇందులో కూడా నష్టాలే మిగిలేలా ఉన్నాయి.

-రైతు వెంకటేశులు, నక్కలపల్లి, బెళుగుప్ప మండలం

సస్యరక్షణ చర్యలు అవసరం



ఈ సారి ఖరీఫ్‌లో సాగైన పంటలో ఎక్కువ శాతం రసం పీల్చే నల్లి ద్వారా వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో కందికి మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. దీంతో కంది పూత రాలిపోతోంది. కాయ ఎదుగుదల కనిపించడం లేదు. పొలంలో ఇతర కంది మొక్కలకు ఈ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ఈ తెగుళ్ల నివారణ కోసం 80 గ్రాములు ఇమామెక్టిన్ బెంజోయేట్ , 80 మి.లీల క్లోరాంట్రానిల్లిప్రోల్‌లను పిచికారీ చేసుకోవాలి.

-చంద్రాయుడు, కేవీకే శాస్త్రవేత్త, కళ్యాణదుర్గం

యాప్ ద్వారానే మద్యం అమ్మాలి

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్లలో సురక్ష యాప్ ద్వారానే మద్యం అమ్మాలని, యాప్ వాడకుండా ఒక్క బాటిల్ అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి జిల్లా డీసీ నాగమద్దయ్య హెచ్చరించారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో గురువారం ఆయన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎక్సైజ్ సీఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలతో సమావేశం నిర్వహించారు. మద్యం నాణ్యత కనుక్కోడానికి ప్రభుత్వం సురక్ష యాప్ తీసుకొచ్చిందన్నారు. దీన్ని ప్రతి వినియోగదారుడు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాప్ వాడకుండా ఎవరూ లిక్కర్ షాపులు, బార్లలో సేల్స్ చేయకూడదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలో బెల్ట్ దుకాణాలు లేకుండా నియంత్రించాలన్నారు. పల్లెల్లో నాటుసారా, కల్తీ కల్లుపై కూడా గట్టి నిఘా పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్ నాయక్, అసిస్టెంట్ ఈఎస్‌లు రేవతి, నరసింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఇతర సీఐలు సీఐలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల బోరు బావులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లా ఎస్టీ రైతులకు రూ29.72 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. బోరుబావికి విద్యుత్‌సౌకర్యం కోసం ఇప్పటికే కొందరు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యం అవసరమైన రైతులు ఈనెల 28లోగా అనంతపురం గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో వివరాలతో అర్జీలను అందజేయాలని డీడీ కోరారు.

రెవెన్యూ క్రీడలకు రూ.5 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఉమర్ ముక్తార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 7,8,9 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు టీడీపీ నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి డాక్టర్ ఉమర్‌ముక్తార్ రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఉమర్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడాపోటీలు అధికారుల మధ్య ఐకమత్యాన్ని, ఆరోగ్యాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తాయన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పెషల్ గ్రీవెన్స్

అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో సమస్యల పరిష్కారానికే స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ టీసీ వరుణ్ తెలిపారు. స్థానిక అహుడా కార్యాలయంలో గురువారం స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించారు. అహుడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి అర్జీలను స్వీకరించిన అనంతరం చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఇవ్వొద్దని సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, నివేదిక అందజేయాలని అహుడా అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఏపీఓ హరీష్‌చౌదరి, ఈఈ దుశ్యంత్, డీఈలు జ్యోతి, రేవంత్ పాల్గొన్నారు.

గుప్తనిధుల వేటగాళ్ల పట్టివేత



గుప్త నిధుల వేటకు వచ్చి దొరికిపోయిన దిలీప్ రెడ్డి, శశికుమార్, శ్రీధర్

నంబులపూలకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పురాతన నరసింహ స్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాలకోసం వచ్చిన ముగ్గురిని స్థానికులు గురువారం రాత్రి పట్టుకున్నారు. నంబులపూలకుంట మండలం ధనియాన్‌చెరువు పంచాయతీ డి.గొల్లపల్లి సమీపంలో పురనాతన నరసింహస్వామి ఆలయం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వద్ద రాత్రిపూట సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. ధనియాన్‌చెరువు, పాతూరు గ్రామాలకు ఈ సమాచారాన్ని చేరవేశారు. రెండు గ్రామాల ప్రజలు గురువారం రాత్రి ఆలయాన్ని చుట్టుముట్టారు. ఆలయం వద్ద ఒక ఆటో, ద్విచక్రవాహనం ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్థుల రాకను పసిగట్టిన ముఠా పారిపోయేందుకు ప్రయత్నించింది. వీరిలో ఇద్దరిని ఆలయ సమీపంలో పట్టుకున్నారు. మరొకరిని వెంబడించి పొలాల్లో పట్టుకున్నారు. గ్రామస్థులు పట్టుబడినవారిని నిలదీయగా, తమది అన్నమయ్య జిల్లా మదనపల్లి అని, గుప్త నిధుల తవ్వకాల కోసం ఐదుగురం వచ్చామని ఒప్పుకున్నారు. పట్టుబడినవారిలో దిలీప్ రెడ్డి, శ్రీధర్, ఆటో డ్రైవర్ శశి కుమార్ ఉన్నారు. పారిపోయిన మహిళ, మరో వ్యక్తి కోసం గ్రామస్థులు పొలాలు, గుట్ట ప్రాంతాల్లో గాలిస్తున్నారు. పట్టుబడినవారిని పోలీసులకు అప్పగించారు.

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉమ్మడి జిల్లాస్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్ బుధవారం స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి పుష్పావతి ప్రకటనలో తెలిపారు. సీనియర్ బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన వారు ఈనెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9553768 295 నంబరులో సంప్రదించాలని కోరారు.

కూటమి పాలనలో అన్నివర్గాలకు మోసం

వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అన్ని వర్గాలకు మోసం జరుగుతోందని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ఎదుట కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుపరం కాకూడదన్న లక్ష్యంతోనే కోటి సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. పీపీపీ టెండర్లలో ఎవరు పాల్గొని దక్కించుకున్నా తాము అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేస్తామన్నారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... వైద్యవిద్యను, సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడం కోసం వైసీపీ హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తన వర్గానికి వాటిని కట్టబెట్టడానికి ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, అనంత

చెన్నై-గుంతకల్లు మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై సెంట్రల్-గుంతకల్లు మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. చెన్నై సెంట్రల్-గుంతకల్లు (06091) ప్రత్యేక రైలు ఈ నెల 19, 21 తేదీల్లో రాత్రి 11-50 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2-15 గంటలకు గుంతకల్లుకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06092) ఈనెల 20, 22 తేదీల్లో సాయంత్రం ఐదున్నరకు గుంతకల్లులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9-45 గంటలకు చెన్నై సెంట్రల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు పెరంబూరు, తిరువల్లూరు, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పట్టె, కుప్పం, బంగారపేట్, వైట్‌ఫీల్డ్, క్రిష్ణరాజపురం, యల్హంక, హిందూపురం, శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం, ధర్మవరం, అనంతపురం, గుత్తి స్టేషన్ల మీదుగా గుంతకల్లుకు చేరుతుందన్నారు. అలాగే తిరువనంతపురం నార్త్-శ్రీసత్యసాయి నిలయం మధ్య కూడా రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. తిరువనంతపురం నార్త్-శ్రీ సత్యసాయి నిలయం (06093) ప్రత్యేక రైలు ఈ నెల 19, 21 తేదీల్లో తిరువనంతపురం నార్త్ స్టేషన్‌లో సాయంత్రం 6-05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం స్టేషన్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06094) శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం స్టేషన్‌లో ఈ నెల 20, 22 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 3-55 గంటలకు తిరువనంతపురం నార్త్ స్టేషన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు వర్కల శివగిరి, కొల్లం, కాయంకులం, చెంగనూరు, తిరువల్ల, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువ, త్రిసుర్, పలక్కడ్, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, సేలం, కుప్పం, బంగారపేట్, వైట్‌ఫీల్డ్, క్రిష్ణరాజపురం, యల్హంక, హిందూపురం స్టేషన్ల మీదుగా శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం చేరుతుందన్నారు. సంత్రగాచి-యల్హంక (08073) ప్రత్యేక రైలు ఈ నెల 21, 28 తేదీల్లో మధ్యాహ్నం 2-45 గంటలకు బయలుదేరి 23, 30 తేదీల్లో తెల్లవారుజామున 12-55 గంటలకు యల్హంకకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (08074) యల్హంకలో ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 4-45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు సంత్రగాచికి చేరుతుందన్నారు. ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, కుద్రారోడ్, బెర్హంపూర్, విజయనగరం, దువ్వాడ, విజయనగరం, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం, హిందూపురం మీదుగా యల్హంకకు చేరుకుంటుందన్నారు.

ధర్మవరం మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి బాగల్‌పూర్-యశ్వంతపూర్ మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాగల్‌పూర్-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (03403) ఈ నెల ఏడో తేదీ రాత్రి పదిన్నరకు బాగల్‌పూర్‌లో బయలుదేరి 9వ తేదీ రాత్రి 11-50 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (03404) ఈ నెల పదిన ఉదయం ఏడు గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి 12న ఉదయం ఏడున్నరకు బాగల్‌పూర్‌కు చేరుకుంటుంద న్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, డోన్, గుంటూరు, విజయవాడ, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బరంపురం, కుర్దారోడ్, భువనేశ్వర్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, అండుల్, భట్టానగర్, బర్ధమన్, రాంపూర్హాట్, బర్హార్వా, సాహిబ్ గంజ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

లెక్చరర్ పోస్టా.. వద్దులే..!

డైట్ లెక్చరర్ పోస్టులకు టీచర్ల విముఖత

ఏడు పోస్టులకు 15 దరఖాస్తులు, నలుగురికే అర్హత

అనంతపురం విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డైట్ (ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ)కు లెక్చరర్లుగా వెళ్లడానికి ఉపాధ్యాయులు అయిష్టత చూపుతున్నారు. బుక్కపట్నం డైట్ కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్లు లేకపోవడంతో అర్హత కలిగిన ఉపాధ్యాయులను ఫారిన్ సర్వీస్ కింద తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లకు అవకాశం కల్పిస్తూ దరఖాస్తుల ను ఆహ్వానించారు. తెలుగు-2, గణితం-1, ఫైన్ ఆర్ట్స్(కళ) 1, పిలాసఫీ-1, సోషియల్ స్టడీస్-2 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ఏడు పోస్టులకు కేవలం 15మంది టీచర్లు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పీజీ ఉన్నా ఎంఈడీ లేకపోవడంతో 11 దరఖాస్తులను తిరస్కరించారు. నలుగురు మాత్రమే డైట్ లెక్చరర్ పోస్టులకు అర్హత పొందారు. వారికి గురువారం నుంచి కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు తెలుగు సబ్జెక్టుకు సంబంధించి ఒకరు మాత్రమే హాజరయ్యారని, మిగిలిన పోస్టులకు శుక్ర, శనివారాలలో కూడా పరీక్షలు కొనసాగుతాయని డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 18వేలమంది టీచర్లు పని చేస్తున్నా అతి తక్కువ దరఖాస్తులు రావడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది. బుక్కపట్నం సుదూరంగా ఉండటం వల్లే చాలా మంది అనంతపురంలో ఉంటున్న అర్హులైన టీచర్లు దరఖాస్తు చేయలేదనే చర్చ నడుస్తోంది. అదే అనంతపురంలో డైట్ కళాశాల ఉండి, ఇవే పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఉంటే ఏస్థాయిలో పోటీనో, ఎన్ని సిఫార్సులు ఉండేవోనన్న అభిప్రాయాలు టీచర్ల నుంచే వినిపిస్తున్నాయి.

మా రెవెన్యూ డివిజన్లు యథాతథంగా కొనసాగించండి

రెవెన్యూ మంత్రి, కమిషనర్, శ్రీసత్యసాయి, అనంత జిల్లా కలెక్టర్లకు ఎమ్మెల్యే పరిటాల సునీత లేఖలు



అనంతపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రెండు రెవెన్యూ డివిజన్లను యథాతథంగా కొనసాగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆమె రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆ శాఖ కమిషనర్ జయలక్ష్మి, శ్రీసత్యసాయి, అనంత జిల్లాల కలెక్టర్లు శ్యాంప్రసాద్, ఆనంద్‌కు గురువారం వేర్వేరుగా లేఖలు రాశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, ఒక నియోజకవర్గంలోని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న అంశంపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూశాఖ యోచిస్తున్న తరుణంలో రాప్తాడు నియోజకవర్గంలోని రెవెన్యూ డివిజన్లు యథాతథంగా ఉంచాలని ఆ లేఖలో ఆమె పేర్కొన్నారు. రాప్తాడు నియోజకవర్గం భౌగోళికంగా చాలా భిన్నమైన పరిస్థితుల్లో ఏర్పడిందనీ, ఆరు మండలాలు ఉండగా... జిల్లాల పునర్విభజనలో మూడు మండలాలు అనంతపురం, మరో మూడు శ్రీసత్యసాయి జిల్లాలో చేర్చిన విషయాన్ని లేఖలో పేర్కొన్నారు. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయన్నారు. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి.. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయన్నారు. భౌగోళికంగా ప్రజల అవసరాలు, పరిపాలనా సౌలభ్యం పరంగా ఇది అందరికీ అనుకూలంగా ఉందన్నారు. ఒక నియోజకవర్గమంతా ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటున్న నేపథ్యంలో... తన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని, తమ నియోజకవర్గ భౌగోళిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యం, పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు మండలంలోని గ్రామాల ప్రజలు అనంతపురం మీదుగా ధర్మవరం రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాలంటే సుమారు 80 కి.మీ వెళ్లాల్సి ఉంటుందన్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధి రామగిరి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు, అదే తరహాలో చెన్నేకొత్తపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, గంగినేపల్లి వాసులు ధర్మవరం మీదుగా అనంతపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి రావాలంటే 85 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు, విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకుని ప్రస్తుతం ఏ రెవెన్యూ డివిజన్‌లో ఏ మండలాలున్నాయో వాటిని అలాగే కొనసాగించేలా చూడాలని ఎమ్మెల్యే.. ప్రభుత్వాన్ని కోరారు.

సత్యసాయి స్ఫూర్తిని చాటేలా..

శతజయంత్యుత్సవాలు: జేసీ



పుట్టపర్తి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా స్ఫూర్తిని చాటేలా శతజయంత్యుత్సవాలను నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నిర్వహణపై అధికారులు, సత్యసాయి ట్రస్టు సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై ఆరాతీశారు. జేసీ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లను చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం, సత్యసాయి ట్రస్టు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు, సత్యసాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శుక్రవారం నుంచి ఏడాదిపాటు జిల్లావ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం ప్రకటనలో అధికారులను ఆదేశించారు. వందేమాతరం సందేశం, ప్రాధాన్యతను ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించాలన్నారు.

రేపు పీఆర్ ఇంజనీర్ల సంఘం ఎన్నిక

అనంతపురం న్యూటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ (పీఆర్) ఇంజనీర్ల సంఘం ఎన్నిక ఈనెల 8న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 9న శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ఎన్నిక నిర్వహించనున్నారు. ఏకగ్రీవం చేస్తారా, ఎన్నిక నిర్వహించాల్సి వస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

పట్టణంలో గంజాయి మొక్కలు



పరిశీలిస్తున్న ఏఎస్పీ

తాడిపత్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైలర్స్‌కాలనీలో ఇళ్ల మధ్యలో రంగనాథ్ అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో గంజాయి మొక్కలు ఉన్నట్లు పోలీసులు గురువారం గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం మేరకు ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, పట్టణ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ గౌస్‌బాషా తమ సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న మొక్కలను పరిశీలించి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. దీంతో ఎక్సైజ్, రెవెన్యూ అధికారులను పిలిపించి పంచనామా నిర్వహించారు. కాగా రంగనాథ్ తన కుటుంబంతో కలిసి ధర్మవరంలో నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

యాదవులను ఆదుకుంటాం

సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న యాదవులను ఆదుకుంటామని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. నక్కా రామ్మోహన్‌రావు యాదవ కల్యాణమండపం లో గురువారం యాదవసంఘం నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో యాదవులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి యాదవ ఎంప్లాయీస్ ఫెడరేషన్, యాదవ విద్యార్థి సంఘం, యాదవ మహిళా సంఘం వంటి వాటి వాటిని ఏకతాటిపైకి తెస్తామన్నారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎంపీడీఓపై వైసీపీ నాయకుడి దాడి



పోలీస్ స్టేషన్ వద్ద ఎంపీడీఓ

రొళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రిపై వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కవిత భర్త విజయ రంగేగౌడ్ దాడి చేశారు. దీంతో ఆయనపై ఎంపీడీఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిల్లుల విషయమైన గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓను ఆయన కార్యాలయంలో విజయ రంగేగౌడ్ కలిశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చేయాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన తరువాతే బిల్లులు చేస్తామని ఎంపీడీఓ సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన విజయ రంగేగౌడ్.. ఎంపీడీఓను దూషిస్తూ, దాడికి ప్రయత్నించారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం కారు ఎక్కబోతుండగా ఎంపీడీఓను రంగేగౌడ్ నెట్టేశారు. కిందపడ్డ ఎంపీడీఓ, కాలికి గాయం కావడంతో డ్రైవర్ సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు చేశారు.

దాడి సరికాదు

పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య

అనంతపురం న్యూటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రిపై దాడి సరికాదని పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ పేర్కొన్నారు. ఎంపీడీఓపై గురువారం దాడి చేసిన రొళ్ల మండలం మాజీ అధ్యక్షుడు విజయ రంగేగౌడ్‌పై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు



నాగయ్య (ఫైల్)

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి మరో ఇద్దరు ఈ లోకాన్ని చూసే వీలు కల్పించారు తమ్మిశెట్టి నాగయ్య(80) కుటుంబ సభ్యులు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన తమ్మిశెట్టి నాగయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, వారి అంగీకారం మేరకు నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ డీవై కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుడి భార్య లక్ష్మీదేవి, కుమారులు కాశీవిశ్వనాథ్, నాగేశ్‌కు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకేశ్రీనివాసులు, డాక్టర్ సుబ్బారావు, లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బత్తలపల్లి, ముదిగుబ్బలో రెండు మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బత్తలపల్లిలోని షాపు నెంబరు -13, ముదిగుబ్బలోని షాపు నెంబరు 18లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు రూ.2లక్షలు డీడీ తీసి వాటికి ఆధార్‌కార్డు జతచేసి ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 10 సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్ కానీ ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 12న శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా తీస్తామని ఆమె తెలిపారు.

ఉత్తమ పొలిటీషియన్‌గా వజ్రకరూరు సర్పంచ్



మోనాలిసా

ఉరవకొండ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలిసాకు ఉత్తమ పొలిటీషియన్‌గా గుర్తింపు దక్కింది. ముంబైలో ఈనెల 8, 9 తేదీల్లో ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ ప్రతినిధులు ఆధ్వర్యంలో జరిగే శిక్షణ తరగతులలో ఆమె పాల్గొననున్నారు. ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గతంలోనూ ఆమె ఢిల్లీలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారు.

రైల్వే ఆస్తుల భద్రతను విస్మరించవద్దు

- ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్



ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న ఐజీ అరోమా సింగ్ ఠాకూర్

గుంతకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తుల రక్షణ బాధ్యతను విస్మరించవద్దని ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. రైల్వే డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో గురువారం ఉదయం ఆమె తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్, ఆర్పీఎఫ్ బ్యారక్స్‌ను ఐజీ సందర్శించారు. కొన్ని నెలల కిందట ఆర్పీఎఫ్ కార్యాలయానికి సమీపంలోనే రైల్వేకు చెందిన కేబుళ్ల చోరీ కావడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజనల్ సెక్యూరిటీ కమిషనరు ఆకాశ్‌కుమార్ జైస్వాల్, సహాయ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్లు అనిల్‌కుమార్ సింగ్, రాజ్ గోపాల్ రెడ్డి, స్థానిక ఆర్పీఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో చురుగ్గా పాల్గొనండి: ఎస్కేయూ వీసీ



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

గుంతకల్లు/టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటూనే క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని ఎస్కేయూ వైస్ చాన్స్‌లర్ అనిత పేర్కొన్నారు. స్థానిక శ్రీ శంకరానందగిరి డిగ్రీ కళాశాలలో ఎస్కేయూ అనుబంధ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వైస్ చాన్స్‌లర్ అనిత మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కళాశాల కరస్పాండెంటు కేసీ హరి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి జెస్సీ, ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తానప్ప, ఆతిథ్య కళాశాల పీడీ మహబూబ్ బాషా, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

పరిశ్రమకు సబ్సిడీ

పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాలు, మాంస ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రభుత్వం సబ్సిడీని ఇస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. 10 శాతం లబ్ధిదారుల వాటా, 90 శాతం బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. ఈ పథకం కింద పాల ఆధారిత ఉత్పత్తులైన పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, పన్నీర్, కోవా తీపి పదార్థాలు, మాంసాహార ఉత్పత్తులైన మాంస ఊరగాయలు, ఇతర మాంస ప్రాసెసింగ్ పదార్థాల తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చునన్నారు. ఔత్సాహికులు జిల్లా రిసోర్స్ పర్సన్ హరీష్ 9676796974 నంబరులో సంప్రదించాలన్నారు. అలాగే జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

అరకొర వైద్యం!

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కొరత

● పరికరాలు లేక వైద్యుల ఇబ్బందులు ● మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్

ప్రభుత్వ వందపడకల ఏరియా ఆస్పత్రి



ధర్మవరంరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలతో సరైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. వంద పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రిలోని ప్రధాన విభాగాల్లో వైద్య పరికరాలు లేవు. దీంతో మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రులకు రెఫర్ చేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు. పలువిభాగాల్లో వైద్యుల కొరత కూడా వేధిస్తోంది.


వైద్యం కోసం వచ్చిన ప్రజలు

అనంతపురం ఆస్పత్రికి రెఫర్

ధర్మవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన రోగులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడ సరైన వైద్య సౌకర్యాలు లేక రోగులను అనంతపురం రెఫర్ చేస్తుంటారు. ఆస్పత్రిలో ప్రస్తుతం అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే యంత్రాలు మాత్రమే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐ, సీటీస్కాన్, వెంటిలేటర్‌వంటి సదుపాయాలు లేక రోగులను అనంతపురం పెద్దాసుపత్రికి తరలిస్తున్నట్లు వైద్యబృందం పేర్కొంది. పలువిభాగాల్లో వైద్యులు లేకపోవడం వల్ల కూడా రోగులను రెఫర్ చేస్తున్నట్లు సమాచారం.

700 దాకా ఓపీ

ప్రరోజు ధర్మవరం పట్టణం, రూరల్, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల నుంచి వివిధ రోగాలతో ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఇందులో ఎక్కువగా గర్భిణులు, వృద్ధులు, కీళ్లనొప్పులతో బాధపడేవారు, జ్వర బాధితులు ఉంటున్నారు. ప్రతిరోజు 700నుంచి 800దాకా ఓపీ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో రోగులు వస్తున్న ఈ ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు అంతంత మాత్రం ఉండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 63.75 లక్షలతో ప్రతిపాదనలు

ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యులు, కమిటీ బృంద సభ్యులు ఆస్పత్రిలోని పలువిభాగాలు, వార్డులను పరిశీలించారు. అందులో ప్రధానంగా పరికరాలు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సీఎస్ఆర్ ఫండ్‌తో రూ.63.75లక్షల విలువైన పరికరాల కోనుగోలుకు ఆమోదం తెలిపారు. పలువిభాగాలకు సంబంధించి పరికరాల కోసం నివేదికలు తయారు చేశారు. ఐసీయూలో మంచాలు, బెడ్లు, అపరేషన్ థియేటర్‌లో పరికరాలు, ఎముకల, జనరల్ సర్జరీలో ఉపయోగించే పరికరాలు, ఈఎన్‌టీ సంబంధింత పరికరాలు, ఆపరేషన్ లైట్లు, పరికరాలు, ప్రసవం కోసం వాడే టేబుళ్లు, స్ట్రక్చర్-4, ట్రాగన్స్ ఛైర్స్ కోనుగోలు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు. ఈ పరికరాలన్నీ సమకూరిస్తే ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

అన్ని సదుపాయాలు ఉండాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సదుపాయాలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి. సీజనల్ వ్యాధుల కాలం వస్తే ఆస్పత్రి రోగులతో నిండిపోతుంది. గతంలో ఒకసారి నేనుకూడా సీజనల్ జ్వరంతో బాధపడుతూ అనంతపురం వెళ్లి చికిత్స చేయించుకున్నా. ఇక్కడే అన్ని సదుపాయాలు ఉంటే అనంతపురం వెళ్లే అవసరం ఉండదు.

-వెంకటేష్, కుణుతూరు, ధర్మవరం మండలం

ప్రతిపాదనలు సిద్ధం చేశాం



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మౌలికసదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించాం. పలువిభాగాల్లో ఆధునాతన పరికరాల కోసం చర్చించాం. సీఎస్ఆర్ ఫండ్ కింద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-తిప్పేంద్రనాయక్,
ఆస్పత్రి సూపరింటెండెంట్, ధర్మవరం

న్యూస్ బాక్స్

విగ్రహ ప్రతిష్ఠకు అంకురార్పణ


కలశ పూజ నిర్వహించిన దృశ్యం

గాండ్లపెంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్నమిట్ట వద్ద వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు గురువారం అంకు రార్పణ చేశారు. ఈ నెల 11వ తేదీ వరకు జరిగే ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలలో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు గోపూజ, గంగపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురారోపణ, యాగశాల ప్రవేశం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇళ్ల వద్దే రేషన్ ఇవ్వాలి: సీపీఐ

ముదిగుబ్బ, నవంబరు, 6(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా, రేషన్ డీలర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సకాలంలో సరుకులు అందక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే మండల పరిధిలో పలువురు డీలర్లు తమకు కేటా యించినచోట కాకుండా దూర ప్రాంతంలో చౌక డిపో నిర్వహిస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంకొందరు డీలర్లు వృద్ధులు, ద్వ్యంగులను కూడా రేషన్ దుకాణం వద్దకే రప్పించుకొని పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. సంబంధిత ఉన్న తాధికారులు కూడా ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు.

అక్రమ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ

● కాంగ్రెస్ నాయకుల విమర్శ

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అక్రమ ఓట్లతో బీజేపీ గద్దెనెక్కి, అరాచక పాలన సాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో శాశ్వత సంస్కరణల కోసం, ప్రజల కోసం గాంధీ కుటుంబం ప్రాణాలను సైతం లెక్కచేయలేదన్నారు. కానీ బీజేపీ వాళ్లు ప్రజలను మోసం చేస్తూ ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నారన్నారు. అక్రమ ఓట్లతో గద్దెనెక్కిన వారు రాహుల్‌గాంధీపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నాయకులు ఎక్కడ స్వాతంత్రం పోరాటంలో పాల్గొన్నారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కలీమ్, దాదాపీర్, రాజు, గణేశ్, బాషా, అమీర్ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

నంబులపూలకుంట, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్‌చెరువులో గురువారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సలు చేసినట్టు పశువైద్యాధికారి బాలనాయక్ పేర్కొన్నారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్ జిల్లా పశుగణాభివృద్ధి ఆధ్వర్యంలో ఈ పశువైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. డాక్టర్లులు వెంకటేష్, శ్రీకాంత్ పర్యవేక్షణలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న పశువులకు చికిత్సలు చేసి, హార్మోన్ ఇంజక్షన్లు, ఉచితంగా మందులు అందచేశామని తెలిపారు. పాడిరైతులు ప్రతి గ్రామంలో నిర్వహించే ఇటువంటి పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ ప్రసన్నబాయి, పశువైద్య సిబ్బంది కిరణ్‌కుమార్ రెడ్డి, మహబూబ్‌బాషా, లక్ష్మీదేవి, రాజ్‌కుమార్, మల్లికార్జున, నరసింహులు, గోపాల్, సుమియా తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

ధర్మవరం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపల్లికి చెందిన రైతులు బసిరెడ్డిగారి నారపరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, హనుమంతరెడ్డి వ్యవసాయ పొలాల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని ఆయిల్, కాపర్‌వైర్‌ను చోరీ చేసినట్లు ఆ రైతులు గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు గురువారం ఉదయం పొలాల్లోకి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా అయ్యే తీగలు కట్ చేసి ఉండటం కనిపించింది. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌వైరుతోపాటు మోటర్ కేబుల్‌ను దొంగలించినట్లు గుర్తించామని తెలిపారు. పొలాల్లో ఇలా చోరీలకు పాల్పడితే పంటలు ఎలా సాగుచేసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు రాత్రివేళ గస్తీ నిర్వహిస్తే చోరీలకు అడ్డుకట్టవేయవచ్చుని పేర్కొంటున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


అరుణ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

నల్లమాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన జనసేన పార్టీ నాయకులు అరుణ్‌కుమార్, లక్ష్మణసాయి ఆ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. పుట్టపర్తి నియోకవర్గ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు చైర్మన్ శివప్రసాద్ మృతుల చిత్రాపటాలకు పూలమాలు వేసి, నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.30వేల వంతున అందచేశారు. అలాగే గాయపడిన బన్నీ కుటుంబాన్ని పరామర్శించి, పత్తి చంద్రశేఖర్ సొంతంగా రూ.20 వేలు అందించారు. అలాగే మృతిచెందిన లక్ష్మణసాయి చెల్లెలిని తాను ఖర్చు భరించి చదివిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వారితో పాటు జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు మహేష్, జయరాం, పెద్దన్న, విష్ణు, గోవర్ధన్, గుడ సోము, రాము, కొండబోయిన సతీష్, అనిల్, శ్రీధర్, జనార్ధన్, సూరీ, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ - ముగ్గురికి గాయలు

బత్తలపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలోని ఇందరమ్మ కాలనీ వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలన్న, లక్ష్మీదేవి ఓ ద్విచక్ర వాహనంలో బత్తలపల్లి నుంచి ఇందరమ్మ కాలనీకి వెళ్తున్నారు. వెనుక ద్విచక్ర వాహనంలో వస్తున్న వెంకటగారిపల్లికి చెందిన రమణయ్య ఆ ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. రెండు బైకులలోని ముగ్గురు కిందపడి గాయపడ్డారు. వారిని స్థానికులు స్థానిక ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లి ప్రమాదానికి కారణాలను గాయపడిన వారిని అడిగి తెలుసుకున్నారు

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి: డీపీఓ


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సమత

ఓబుళదేవరచెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆదాయం పెంచేందుకు కృషి చే యాలని జిల్లా పంచాయతి అధికారి(డీపీఓ) స మత గ్రామ కార్యాదర్శులకు సూచించారు. పం చాయతీ అభివృద్ధి, స్వర్ణ పంచాయతీ, చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణ వంటి అంశాలపై డీపీఓ గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాల యంలో గ్రామ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చెత్త సే కరణ తయారీ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్టను తయారు చేసి, వాటిని అమ్మగా వచ్చే ఆదా యంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాల న్నారు. టాక్స్, నాన్ ట్యాక్స్ పన్నుల ద్వారా ఆదా యం పెంపొందించాలని తెలిపారు. అంతకు మునుపు కొండకమర్ల, ఓడిచెరువు చెత్త సేకరణ తయారీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ అంజినప్ప, కార్యాలయ పర్యవేక్షకులు రమణనాయక్, గ్రామ కార్యదర్శులు మల్లికార్జున, శంకర్, రామాంజినే యులు, మద్దిలేటిరెడ్డి, గంగాధర్‌నాయక్, రఫీ, నిర్మల, పద్మజ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

తనకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఎంపీడీ ఓ రామానాయక్, డిప్యూటీ ఎంపీడీఓ మురళీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చంద్రనాయక్ పాల్గొన్నారు. ఇప్పటివరకు ఎన్ని ఆధార్ అప్‌డేట్ చేశారని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రజల సమస్యలపై దృష్టి సారించండి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే సింధూరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతిధులు

పుట్టపర్తి రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులకు సూచించారు. పుట్టపర్తి మండల పరిషత్‌కార్యాలయంలో గురువారం ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులు పండించిన పంటలకు సరైన మార్కెట్ సౌకర్యంలేక నష్టపోతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, పట్టుపరిశ్రమలు, గ్రామీణ అభివృద్ధి శాఖల అదికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని సూచించారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం, వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. పట్టుపురుగుల పెంపకం నియోజకవర్గంలో తక్కువగా ఉందని, దాన్ని ప్రోత్సహించాలని కోరారు. గ్రా మైక్య సంఘాల ద్వారా రైతుల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి పుట్టపర్తి బ్రాండ్‌గా అభి వృద్ధి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిం చడంలో అధికారులు చొరవచూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక మంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచులు చిన్నపెద్దన్న, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, జగరాజుపల్లి ఎంపీటీసీ మధురిమ తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ఎమ్మెల్యే

పట్టణంలోని ఆర్వీజే కల్యాణమండపంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఎమ్మెల్యే గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బ్రహ్మకుమారీలు ఘనస్వాగతం పలికారు.

కంటిపై అవగాహన కల్పించాలి: కలెక్టర్


కంటి పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

కొత్తచెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఉచిత కంటి స్క్రీనింగ్ శిబిరాన్ని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గ్రామీణుల కంటి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఈ వైద్యశిబిరాలను నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చాలామంది గ్రామీణులు కంటి జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారని, వారిని దృష్టిలో ఉంచుకుని ఒక ప్రక్క ప్రభుత్వం, మరోపక్క స్వచ్ఛంద సంస్థలు ఉచిత కంటి వైద్యశిబిరాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, డీసీహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్, డీసీఎంఓలు డాక్టర్ అనూరాధ, అశ్వత్థకుమార్, డీఐఓ డాక్టర్ సురేశ్‌బాబు, శంకర నేత్రాలయ వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రి కమిటీ సభ్యులు మాజీ ఎంపీపీ వాణి, ఒలిపిశీన, సాలక్కగారి శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ, టీడీపీ మండల కన్వీనర్ రామకృష్ణ, నాగేంద్ర ప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు హరిప్రసాద్, నల్లమాడ శంకర్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక... 3 గంటల్లో గుర్తింపు


అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ తప్పిపోయిన ఐదేళ్ల బాలికను అనంతపురం టూటౌన్ పోలీసులు మూడు గంటల్లో గుర్తించారు. ఆ బాలికను సీఐ శ్రీకాంత్ యాదవ్ బాధిత తల్లి చెంతకు చేర్చారు. ఐదేళ్ల వయస్సు ఉన్న అలేఖ్య ధర్మవరం టౌన్‌లోని కదిరి గేట్ వద్ద నివాసం ఉంటున్న కీర్తి, కుమార్ దంప తుల కుమార్తె. బర్త్ సర్టిఫికెట్ కోసమని తల్లి కీర్తి కుమార్తెతో కలసి బుధవారం సాయంత్రం 4 గంటలకు అనంతపురంలోని ప్రభుత్వా సుపత్రికి వచ్చింది. ఆసుపత్రి ఆవరణలో మెయిన్ గేటు వద్ద ఇసుకలో ఉదయం 7.30 గంటలప్పుడు బాలిక ఆడుకుంటుండగా... తల్లి టిఫిన్ కోసం బయటకెళ్లింది. మళ్లీ వచ్చి చూస్తే పాప కనిపించలేదు. తల్లితో పాటు స్థానిక ఆసుపత్రి సిబ్బంది వెతికినా కనిపించలేదు. చివరికి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక కోసం ఆసుపత్రి పరిసరాల్లో తీవ్రంగా వెతికారు. మూడు గంటల్లోనే చిన్నారి ఆచూకీని గుర్తించి తల్లికి అప్పగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


అనంత పద్మనాభస్వామి వేషధారణ

పుట్టపర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జానకిరామయ్య కల్యాణమండపంలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓం శాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి వేషధారణ భక్తులను అలరించింది. చిన్నా రులు భక్తి పాటలు, నృత్యంతో ఆకట్టుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోసం జ్యోతిర్లింగాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

డిపో ఆదాయం పెంచడం ప్రశంసనీయం : ఈడీ


ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈడీ చంద్రశేఖర్

కదిరి అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలైన తర్వాత కదిరి ఆర్టీసీ డిపో ఆదాయం పెంచడంలో కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది పాత్ర ప్రశంసనీయమని కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆయన గురువారం కదిరి డిపోను తనిఖీ చేశారు. బస్టాండ్ పరిసరాలను పరిశీలించి ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమష్టి కృషితో డిపో ఆదాయాన్ని మరింత పెంచాలని ఉద్యోగులకు సూచించారు. డిపో మేనేజర్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్: ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలియచేశారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతో పాటుగా మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొంటారని, నియోజకవర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే సూచించారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

మండల పరిధిలోని అమగొండపాల్యెంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే కార్తీకవన భోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె హాజరవుతారని ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ప్రకటనలో తెలియజేసింది. అలాగే రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకు సత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకునే రాష్ట్ర ఐటీ, మానవవనరులు, ఆర్టీజీ శాఖామంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకనున్నారు. అనంతరం మునిసిపాలిటీలో సీసీరోడ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేస్తారని తెలియజేసింది.

పోలీసుల ఆధ్వర్యంలో ఏక్తా దివస్


రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు, ప్రజలు

తనకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామస్థులు జాతీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ ఐక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లబాయి పటేల్ జయంతి పురస్కరించుకుని ఈకార్యక్రమం ఏర్పాటు చేశారు. రన్‌ఫార్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐక్యతకు, సమ్రగత్తకు సోదర భాం గురించి ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఎస్ఐ తెలిపారు. ప్రతి పౌరుడు సర్దార్‌వల్లబాయిపటేల్ అడుగుజాడలో నడిచి దేశ సమగ్రతను కాపాడే బాద్యత తీసుకోవాలని ఆయన కోరారు.

పెండింగ్ జీతాలను చెల్లించండి

● ఉపాధి హామీ ఉద్యోగుల విన్నపం


డ్వామా పీడీకి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

పుట్టపర్తిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నాలుగునెలలుగా పెండింగ్‌లో ఉన్న జీత భత్యాలను వెంటనే చెల్లించాలని జిల్లా ఉపాధి హామీ పథకం సిబ్బంది డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్‌కు విన్నవించారు. వారు గురువారం జిల్లాకేంద్రంలోని డ్వామా కార్యాలయ ప్రాంగణంలో పీడిని కలసి వినతిపత్రం అందచేసిన అనంతరం ఉపాధి హామీ పథకం సిబ్బంది జేఏసీ అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ... నాలుగునెలలుగా పెండిం గ్‌లో ఉన్న జీతభత్యాలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే వెల్ఫేర్ సమస్యలు, 23శాతం పీఆర్‌సీ, గ్రేడ్ ఫిక్సేషన్, గ్రాట్యుటీ అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా మార్చాలని కోరారు. తమకు న్యాయంగా రావాల్సిన పదోన్నతులను కల్పించాలని, హెల్త్‌కార్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలనే డిమాండ్లను సీఆర్‌డీ కార్యాలయానికి పంపి న్యాయం చేయాలని వారు పీడీని కోరారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ల జేఏసీ అధ్యక్షుడు సాయినాథరెడ్డి యూనియన్ నాయకులు, బీఎఫ్‌టీలు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లండి

● కొత్తచెరువు: తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ దృష్టికి తీసుకెళ్లాని డ్వామా, ఎన్ఆర్‌జీఎస్ ఉద్యోగుల జేఏసీ నాయకులు పుట్టపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్‌ను కోరారు. వారు గురువారం మార్కెట్‌యార్డు చైర్మన్ పూల శివప్రసాద్‌ను ఆయన స్వగృహంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం వారు తమకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. డ్వామా జేఏసీ అధ్యక్షుడు మనోహర్, టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు నంజప్ప, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు


ముచ్చురామి -రేగాటిపల్లి దారి మలుపులో పెరిగిన కంపచెట్లు

ధర్మవరం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామం నుంచి రేగాటిపల్లికి వెళ్లే రహదారిలో ఓ మలుపు ప్రమాదకరంగా మారింది. ఆ మలుపు వద్ద కంపచెట్లు ఏపుగా పెరగడంతో రోడ్డు కనిపించక తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయా గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలువురు రోడ్డు ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యారు. ప్రధానంగా ఈ రహదారి గుండా ధర్మవరం నుంచి సీతారంపల్లి క్రాస్, జాతీయ రహదారికి వాహనాలు వెళుతుంటాయి. ఎటువంటి సూచికబోర్డులు గానీ, డివైడర్లు లేకపోవడంతో మలుపు వద్ద ద్విచక్రవాహనాలు అదుపుకాక పలువురు కిందపడి మృత్యువాతపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మలుపు వద్ద కంపచెట్లు తొలగించి, మలుపు కనిపించేలా సూచిక బోర్డులు, డివైడర్లను ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డుపక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పరిగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర నడిబొడ్డున ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ దర్శనమిస్తోంది. పరిగి నుంచి పైడేటికి వెళ్లే రహదారి పదడుగుల వెడల్పు కూడా లేదు. ఈ రహదారికి ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ నిర్మించడంతో బస్సు డ్రైవర్లు ఆదమరిస్తే అంతే సంగతులు. ఒక వాహనం వెళ్తుండగా మరో వాహనం దాటడానికి కూడా స్థలంలేదు. నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరేచోట ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

గోరంట్ల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులేరువీధిలో ప్రజల సౌకర్యార్థ సీసీ రోడ్డు పనులకు గురువారం టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. రూ. 10లక్షల ఎంపీ నిధులతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎంపీ పార్థసారథి గోరంట్ల నాల్గవ వార్డులో పర్యటిస్తూ పులేరు వీధి ప్రజల సౌకర్యార్థం రహదారి, తాగునీటి సమస్య పరిష్కారిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే మంచినీటిబోరు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం సీసీరోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అశ్వర్థరెడ్డి, బోయ లక్ష్మీనారాయణ, సంతోష్, నీలకంఠా రెడ్డి, ఫిరోజ్‌బాషా, నరసింహప్ప, నరేంద్ర, బాలక్రిష్ణ, కావేరి పాల్గొన్నారు.

లైన్‌మన్‌ను దూషించిన టీడీపీ నాయకుడు

హిందూపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన జూనియర్ లైనమ్‌న్ ఎస్ఎండీ ఎజాజ్‌ను టీడీపీ నాయకుడు రంగారెడ్డి దుర్భాషలాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. తన పొలంలో అడ్డంగా విద్యుత్ స్తంభాలను నాటారని ఈనెల 2న ట్రాన్స్‌కో ఏఈ జయవర్ధన రెడ్డికి రంగారెడ్డి ఫోన్ చేశాడు. ఆ సమయంలో ఎజాజ్‌ను కాన్ఫరెన్స్‌లోకి తీసుకుని దూషించాడు. విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించకపోతే స్తంభానికి కట్టేస్తానని, కేసుపెట్టి లోపల వేయిస్తానని బెదిరించాడు. ఈ సంభాషణలను బాధితుడు సెల్ఫీ వీడియోకు జతచేసి, గురువారం సోషల్ మీడియాలో పెట్టాడు. రంగారెడ్డి, ఏఈ జయవర్ధనరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనను కాపాడాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విన్నవించాడు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతుల నుంచి డబ్బులు వసూలు చేయాలని ఏఈ సూచించారని, తాను ఆ పని చేయనందుకు కక్ష కట్టారని ఆరోపించాడు.

రోడ్డుపైకి మురుగునీరు

స్పందించని అధికారులు



మురుగునీటిలో నడుచుకుని వెళ్తున్న ప్రజలు

గోరంట్ల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వార్డు వంకవీధిలో మురుగునీరు రోడ్డుపైకి రావడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి మురుగునీరు రోడ్డుపైకి రావడంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. వర్షం వచ్చిన ప్రతిసారీ తమకు ఈ సమస్య ఎదురవుతోందని ఆప్రాంతవాసులు అంటున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కంపచెట్లను తొలగించండి

సుద్దకుంటపల్లి వాసుల వినతి



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

సోమందేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందిగా మారాయని గ్రామస్థులు తెలిపారు. కేతగానిచెరువు గ్రామం నుంచి సుద్దకుంటపల్లివరకు అదేవిధంగా జూలకుంట, మండ్లి వరకు ఉన్న రోడ్డులో ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో మలుపుల్లో రోడ్డుకానరాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రాత్రివేళల్లో ప్రయాణం నరకప్రాయంగా ఉందన్నారు. నాయకులు, అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని నందు

లేపాక్షి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని నందు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నీలిమ తెలిపారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో బుధవారం జరిగిన అండర్-17 కబడ్డీ పోటీల్లో విద్యార్థిని మంచి ప్రతిభ కనబరచిందన్నారు. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికచేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

'గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు'

పెనుకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయప్ప పేర్కొన్నారు. గురువారం పరిటాల శ్రీరాములు డిగ్రీకళాశాలలో వసతులు, గ్రంథాలయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల లైబ్రేరియన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజ్ఞాన సంపద మనిషికి సంతృప్తినిస్తుందన్నారు. గ్రంథాలయాల్లో సాహిత్యం, వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు ఉన్నాయని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ యశోద రాణి, అధ్యాపకులు రామన్న పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి'

పెనుకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ పీఓ శివన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక శిబిరం 3వ రోజు గుడ్డంపల్లి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించి శుభ్రం చేశారు. వెంకటేశ్వరస్వామి గుడివద్ద మొక్కలు నాటడానికి 150గుంతలు తీశారు. దోమల నివారణపై ర్యాలీ నిర్వహించారు.

బీటీ రోడ్లుగా మట్టిరోడ్లు

నిర్మాణానికి రూ.14 కోట్లు విడుదల

మండలానికి రూ.3కోట్లు కేటాయింపు



బీటీ రోడ్డుగా మారనున్న దొడ్డేరి-పిల్లిగుండ్ల రోడ్డు

మడకశిర, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకర్గంలోని ఐదు మండలాలకు ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ.14 కోట్లు మంజూరు చేశారు. ఒక్కొక్క మండలానికి రూ. 3 కోట్ల చొప్పున కేటాయించారు. ఈ నిధులతో మట్టిరోడ్లు బీటీ రోడ్లుగా మారనున్నాయి. గత ఐదు సంవత్సరాల్లో నియోజకర్గంలో గ్రామీణ రహదారులు నిర్లక్ష్యానికి గురయ్యారు. దీంతో ఆ ప్రాంతాలలోని ప్రజలు దెబ్బతిన్న రోడ్ల ద్వారా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతుండేవారు. వర్షాకాలంలో ఆ రోడ్ల గుండా వెళ్లాలంటే మరీ ఇబ్బందులు పడేవారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆయా ప్రాంతాలవాసులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో ఆ రహదారుల రూపురేఖలు మారనున్నాయి. దీంతో ఆయాప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుడిబండ మండలంలో లక్కప్పన పల్లి నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు 0.8 కిలోమీటరకు రూ. 50లక్షలు, బాలేపల్లి నుంచి రాష్ట్ర సరిహద్దుకు 0.8 కిలోమీటర్లకు రూ. 50లక్షలు, వీరజ్జన పల్లి నుంచి వయా మోర్‌బాగల్ రోడ్డుకు కిలోమీరుకు రూ. 30లక్షలను వ్యయం చేయనున్నారు. దినేహట్టి నుంచి వడ్రహట్టికి సంబంధించి 0.5 కిలోమీరుకు రూ.25ల క్షలు, దిన్నేహట్టి రోడ్డుకు 0.5 కిలోమీటరుకు రూ.25లక్షలు, సిద్ధేశ్వరస్వామి దేవాలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు కిలోమీటరుకు రూ.40 లక్షలతో బీటీ రోడ్లుగా మారనున్నాయి. కొంకల్లు నుంచి వట్టే బెట్ట రోడ్డుకు 0.8 కిలోమీటరుకు రూ.50లక్షలు, మడకశిర మండలంలో నల్లనాయనిపల్లి రోడ్డుకు రూ. 50 లక్షలు, కోనప్పపాళ్యం నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు రూ.50 లక్షలు, రేకులకుంట రోడ్డు నుంచి మల్లికార్జున దేవాలయం వరకు రూ.50 లక్షలు, కోనప్పపాళ్యం నుంచి వయా రంగనాథస్వామి దేవాలయం వరకు రూ.50లక్షలతో మట్టిరోడ్లు బీటీరోడ్లుగా మారనున్నాయి. అదే విధంగా రొళ్ల, అమరాపురం, అగళి మండలాలకు ఒక్కొక్కటికి రూ. 3 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

నియోజకవర్గానికి రూ.14 కోట్లు

నియోజకర్గంలోని ఐదు మండలాలకు రూ.14 కోట్లు మంజూరు చేశారు. ఒక్కొక్క మండలానికి రూ. 3 కోట్ల చొప్పున విడుదలయ్యాయి. ఈ నిధులతో మట్టిరోడ్లు బీటీ రోడ్లుగా మారనున్నాయి. త్వరలోనే పనులు చేపడతాం.

-వేంకటేశులు, డీఈఈ, పీఆర్

కంపెనీలకు మీరే రిజిస్ట్రేషన్ చేయించండి

ప్రైవేట్ వ్యక్తులతో మోసపోవద్దు: టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

రొద్దం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో సోలార్ కంపెనీ ఏర్పాటుపై భూములను ప్రైవేట్ వ్యక్తులు అగ్రిమెంట్ చేసుకుని రైతులను మోసం చేస్తున్నారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం రొద్దం టీడీపీ నాయకులు పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు. మండల పరిధిలోని అనేక గ్రామాల్లో భూములు అధికంగా ఉన్న దృష్ట్యా సోలార్‌ప్లాంట్ల కోసం భూములను రైతుల నుంచి జిరాక్స్ కాపీలు సేకరించి ప్రైవేట్ వ్యక్తులు అగ్రిమెంట్ చేసుకుని సోలార్ కంపెనీలకు వారు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని విమర్శించారు. రైతులు నేరుగా సోలార్ కంపెనీలకే లీజు అగ్రిమెంట్ చేసుకుంటేనే ఏడాదికోమారు డబ్బులు వస్తాయన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు అగ్రిమెంట్ చేస్తే నష్టపోవాల్సి వస్తుందన్నారు. నంద్యాలలో ఎకరానికి రూ.45వేలు ఏడాదికి ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరస్సింహులు, కన్వీనర్ నరహరి, వెంకటరామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు, సిద్దన్న, అశ్వర్థనారాయణ, డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, శంకర తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పరిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జయమంగళినది పరివాహక ప్రాంతం నుంచి నేతులపల్లి, శాసనకోట గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. ఊటకూరు గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్, సుబ్బరాయనపల్లికి చెందిన రెండు ట్రాక్టర్లు, కొట్నూరుకు చెందిన ఓ ట్రాక్టరు ప్రభుత్వ అనుమతులు పొందకుండా కర్ణాటక రాష్ట్రానికి, ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నట్లు స్థానికుల సమాచారం అందించారన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించామన్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను కోర్టుకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు: తహసీల్దార్

పరిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయమంగళి, పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హసీనాసుల్తానా గురువారం విడుదలచేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇసుకను అవసరానికి మించి తరలించరాదన్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణం, సొంత అవసరాలకు కేవలం మనుషుల ద్వారానే ఇసుకను ట్రాక్టర్లలో తరలించాలని యంత్రాలను ఉపయోగిస్తే సీజ్ చేస్తామన్నారు. అదేవిధంగా ఇసుకను అనుమతిలేకుండా అక్రమంగా తరలిస్తే మొదటి సారి రూ.10వేలు జరిమానా, రెండోసారి రూ.20వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ సర్పంచ్ మృతి

పెనుకొండ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనిపేట గ్రామానికి చెందిన సర్పంచ్ నాగరాజు బెంగళూరులో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నాగరాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దీనికితోడు కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు సేవించి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతపురంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో బెంగళూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

'చింత సాగుతో అధిక ఆదాయం'

గుడిబండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాల్లో చింత మొక్కలు పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని అకర్ద నెదర్లాండ్ ప్రాజెక్ట్ అధికార ప్రతినిధులు హార్మోమీలాలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిమ్మలాపురం గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విరివిగా చింత సాగుచేయాలన్నారు. అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రైతులకు అవసరమయ్యే మొక్కలను అందించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎకాలజీ కోఆర్డినేటర్ వీరభద్రారెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

రన్ ఫర్ యూనిటీ ర్యాలీ



యూనిటీ రన్‌లో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

లేపాక్షి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమం గురువారం లేపాక్షిలో జరిగింది. రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో రన్ సాగింది. ఇందులో విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి నంది విగ్రహం వరకు రన్‌ను నిర్వహించారు.

అగళి, (ఆంధ్రజ్యోతి): వల్లభాయ్ పటేల్ జయంతి ని పురస్కరించుకుని మండల కేంద్రంలో రన్‌ఫర్‌యూనిటీ నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులతో కలిసి జిల్లా ఉన్నత పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీరాములు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ కేవలం నాయకుడేకాదని, దేశ ఐక్యతకు చిహ్నమన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజన్న, శివన్న, ఉమాశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌర కార్మికులకు పక్కా ఇళ్లు: ఎమ్మెల్యే



ఇళ్లను ప్రారంభించి కార్మికులకు ఇస్తున్న ఎమ్మెల్యే

పావగడ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనుమాన్ చెరువు దగ్గరలో 17 పక్కా ఇళ్లను పౌరకార్మికులకు పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ప్రారంభోత్సవం చేసి అప్పగించారు. 77మంది పౌర కార్మికులకు ఇళ్లు మంజూరు కాగా ఒకటో విడతగా 17మందికి ఇవ్వగా మిగిలిన వారికి త్వరలోనే ఇస్తామని ఎమ్మెల్యే వెంకటేశ్ అన్నారు. పౌరకార్మికులు ఇళ్లను ఎవరికీ విక్రయించవద్దని, పిల్లల భవిష్యత్తుకు ఉపయోగించుకోవాలని సూచించారు. 38మంది పౌర కార్మికులకు విశేష నిధుల కింద రూ.7వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్‌కుమార్, ఉపాధ్యక్షులు మాలిన్‌తాజ్, కౌన్సిలర్లు రవి, రాజేష్, సుబ్రహ్మణ్యం, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా వైద్య సేవలు

పరీక్షలు నిర్వహించేందుకు హాజరుకాని వైద్యులు



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

గుడిబండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో 104ద్వారా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అయితే గురువారం మండలంలోని చిగతుర్పి గ్రామంలో 104ద్వారా గ్రామాల్లో బీపీ, షుగర్, జ్వరం తదితరవాటికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి చికిత్స అందజేయాలి. అయితే శిబిరానికి వైద్యులు రాకపోవడంతో ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎలంతోనే శిబిరాన్ని నిర్వహించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి 104 వైద్యశిబిరానికి వైద్యులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎంపీడీఓపై దాడి అమానుషం: టీడీపీ

రొళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉన్న రొళ్ల మండలం ఎంపీడీఓ నాగేశ్వర్‌శాస్త్రిపై వైసీపీ నాయకుడు మాజీ ఎంపీపీ భర్త విజయరంగేగౌడ్ దాడి అమానుషమని మండల టీడీపీ నాయకులు ఖండించారు. విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారిపై విచక్షణారహితంగా దాడిచేసిన అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ మండల నాయకులు గురుమూర్తి, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ దాసరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఈరన్న, రామక్రిష్ణ, ఐపీఐఏసీ డైరెక్టర్, భరత్, ఉగ్రేగౌడ్, మారుతి, నాగరాజు, ఆనంద్, నాగేంద్ర తదితరులు దాడిని ఖండించారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనిశెట్టిపల్లి గ్రామ పరిసరాల్లో పేకాట స్థావరాలపై బుధవారం రాత్రి దాడుల నిర్వహించినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. దాడుల్లో ఐదుగురిని అరెస్ట్ చేయగా మరో ఐదుగురు పారిపోయారన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ. 45, 130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగంపల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడు శ్రీహరి క్రిమిసంహారక మందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్సలు చేసి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. అక్కడ చికిత్స అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజాసమస్యల పరిష్కారానికే పల్లెబాట

ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య



సమస్యలు తెలుసుకుంటున్న వీరయ్య

హిందూపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడానికే పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పీఏ వీరయ్య పేర్కొన్నారు. గురువారం హిందూపురం మండలం బేవనహళ్లి పంచాయతీలో పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై ఆరాతీశారు. వీటితోపాటు సమస్యలపై కూడా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగరాజు, మూర్తి, మంజు, బాబు, చంద్రశేఖర్, సోము, అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సమస్యలు పరిష్కరించండి

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యు విద్యార్థి సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ బాలుర వసతిగృహంలో 50మంది ఉన్నారన్నారు. వీరు సరైన సౌకర్యాలులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెనూ ప్రకారం భోజనం అందడంలేదన్నారు. గదులు సరిగా లేక వర్షం వచ్చినప్పుడు విద్యార్థులు భయంభయంతో వసతిగృహంలో ఉంటున్నారన్నారు. కిటికీలకు దోమతెరలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నందీశ్, నాగేంద్ర, భగత్, దిలిప్, అభి, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

కనకదాస జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కురుబ సంఘం నాయకులు



మాట్లాడుతున్న కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు

పెనుకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కనకదాస జయంతిని ఈనెల 8న ఘనంగా నిర్వహిద్దామని కురుబ సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక అన్నాక్యాంటిన్‌లో ఆ సంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, రామాంజినేయులు మాట్లాడుతూ కనకదాస జయంతి కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కురుబ సంఘం నాయకులు తరలిరావాలన్నారు. జయంతిని పూర్తిచేసుకున్న తరువాత కళ్యాణదుర్గంలో నారాలోకేష్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి అందరూ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, పెనుకొండ మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ, రామాంజినేయులు, వెంకటరాముడు, ముత్యాలప్ప, శీనప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, ఆదినారాయణ పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

చిలమత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శివ నామ స్మరణ చేస్తూ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సోమఘట్ట సింగిల్ విండో ఛైర్మన్‌గా బయపరెడ్డి

చిలమత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సోమఘట్ట సహకార సంఘం ఛైర్మన్‌గా ఎస్.ముద్దిరెడ్డిపల్లికి చెందిన బడోళ్ల బయపరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బయపరెడ్డి పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సుమన్

అగళి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా సుమన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వీరేష్ రొళ్లకు బదిలీకావడంతో మడకశిరలో పనిచేస్తున్న ఎస్ఐ సుమన్ అగళికి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకుంటానన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

పరిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్‌బేగం గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో కొంత కాలంగా సిబ్బంది మధ్య విబేధాలు ఉంటుండంతో ఒకరిపై ఒకరు జిల్లా వైద్యాధికారిణికి ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఆసుపత్రిని సందర్శించినట్లు తెలిసింది. వైద్యులు, సిబ్బందితో వేరువేరుగా మాట్లాడి విబేధాలకు కారణాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎవరు విధులు నిర్వహించడంలేదు..? అనే విషయాలను తనిఖీల్లో తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎంహెచ్ఓ తెలిపారు.

విద్యార్థి విష్ణువర్ధన్‌కు రాజ్యోత్సవ ప్రశస్తి



విష్ణువర్ధన్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

పావగడ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని కిల్లర్లహళ్లి గ్రామంలోని నాగరాజు తనయుడు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి విష్ణువర్ధన్‌కు కన్నడ రాజ్యోత్సవ ప్రశస్తితోపాటు మరో పురస్కారాన్ని ప్రభుత్వం అందజేసింది. డ్రాయింగ్, జానపద, ఆటలపోటీలు, పలు కన్నడపరమైన సంఘాలలో సేవలందించిన అతడిని ఫిలిం చాంబర్ తరుపున యువరత్న ప్రశస్తిని, అఖిల కర్ణాటక బసవ యువక సంఘం నుంచి శివకుమార్ స్వామీజీ ప్రసస్తిని అందించి గౌరవించారు. ఈ నేపథ్యంలో కన్నడ సాహిత్య పరిషత్ తరుపున 2025కుగాను కన్నడ రాజ్యోత్సవ ప్రశస్తిని అందించి గౌరవించారు. కిల్లర్లహట్టి గ్రామస్థులు వష్ణువర్ధన్‌ను అభినందించారు.